
కథ

# నారుమడి

సోమవఝల నాగేంద్ర ప్రసాదు



"ఏవండీ ఇందాక మీ చెల్లెలు సావిత్రి ఫోను చేసిందండి" భర్త రామారావు కంచంలో కూర వడ్డిస్తూ అంది భార్య కమల.

"ఆహా...ఏంటి అందరూ కులాసాయేనా? మన కోడలు పిల్ల సుధ ఏం చేస్తోందట?" నవ్వుతూ అడిగాడు రామారావు.

"ఆ విషయం గురించే సావిత్రి ఫోను చేసిందండి. మొన్న ఆ ఊరి కరణంగారు సుధని వాళ్లబ్బాయికి చేసుకుంటామని అన్నారట. అందుకని సుధ విషయంలో మన అభిప్రాయం చెబితే మంచిదని అన్నదండి." చెప్పింది కమల.

"ఏంటి కమలా! సుధని మన అబ్బాయి రవికి చేసుకోవాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాం కదా. మరలా దానికి సందేహం ఎందుకు వచ్చిందట?" తిరిగి ఆమెను ప్రశ్నించాడు రామారావు.

"అదే నాకు అర్థం కావడం లేదండి. ఎందుకైనా మంచిది మీరు ఒకసారి మీ చెల్లెలుతో మాట్లాడండి" సలహా ఇచ్చింది కమల.

అంతవరకూ అక్కడే ఉండి వారి మాటలు వింటున్న రామారావు తండ్రి సోమశేఖరం కల్పించుకుంటూ, "ఏమోరా దాని భయం దానిది. ఎందుకుంటే మన రవి ఐపిఎస్ ట్రైనింగ్ పూర్తి చేసుకొని, ఇవాళో రేపో ఉద్యోగంలో జాయినవుతాడు కదా! బహుశా మీకేమైనా వాడి విషయంలో పెద్ద ఆశలు ఉన్నాయేమోనని దాని అనుమానం అయి ఉండవచ్చు" కూతురు సావిత్రిని సమర్థిస్తూ అన్నాడు.

"ఇది చాలా బావుంది నాన్నా! సుధ పుట్టినప్పుడే నా కోడలు అని చెప్పాను. అదే మాటకి ఇప్పటికీ కట్టుబడి ఉన్నాను. నేను ఆడిన మాట తప్పేంత సంస్కార హీనుణ్ణి కాను" బాధగా అన్నాడు రామారావు.

"నిజమేరా, నా పెంపకం మీద నాకా నమ్మకముంది. నేను నా పిల్లల్ని సభ్యతా, సంస్కారమనే 'నారు' జల్లి పెంచి పెద్ద చేసాను" గర్వంగా తన పెంపకం గురించి మనసులోనే అనుకున్న సోమశేఖరం " ఏమైనా నువ్వొకసారి సావిత్రితో మాట్లాడితే మంచిదేమోరా, అందువల్ల నష్టమేం లేదుగా?"

"సరే నాన్నా! ఈ రోజే దానితో మాట్లాడతాను" అంటూ భోజనం ముగించి తన రూములోకి వెళ్లిపోయాడు రామారావు.

"భగవంతుడా! ఏ అవాంతరాలు లేకుండా నా మనవరాలి పెళ్లి దాని బావ రవితో జరిపించు తండ్రీ" అంటూ ఆ భగవంతుణ్ణి మనసారా కోరుకున్నాడు సోమశేఖరం.

***

"అమ్మా సావిత్రీ! ఎలాగున్నావమ్మా, కులాసాయేనా? బావగారూ, సుధ ఎలా ఉన్నారు?" అందర్నీ పేరు పేరునా కుశలమడిగాడు రామారావు.

"మేం బాగానే ఉన్నామన్నయ్యా! మీరెలా ఉన్నారు? సాయంత్రమే వదినతో మాట్లాడాను" ఎంతో ఆనందంగా చెప్పింది సావిత్రి.

"మీ వదిన అన్ని విషయాలూ చెప్పిందమ్మా. అందుకే ఫోను చేశాను. ఏంటి సుధని మా ఇంటి కోడల్ని చేసుకోమని నీకేమైనా అనుమానమా?" నేరుగా విషయంలోకి వస్తూ అడిగాడు రామారావు.

Story

''అదీ..అదీ'' ఏదో చెప్పబోతున్న సావిత్రితో, ''చూడమ్మా నీకు గుర్తుండే ఉంటుంది. సుధ పుట్టిన నాడే నా కోడలు పుట్టిందని అన్నాను. అలాగే నీకూ, బావగారికి కూడా సుధని నా కోడల్ని చేసు కుంటానని ఆనాడే మాట ఇచ్చాను. నీ అన్నయ్య ఎప్పటికీ మాట తప్పేవాడు కాదమ్మా. అయినా నీకు సందేహం మరి ఎందుకువచ్చిందో నాకు తెలి యదు'' అంటూ బాధగా అన్నాడు రామారావు.

''ఏం లేదన్నయ్యా. మన రవి ఇప్పుడు ఐపిఎస్ ఆఫీసరు అవుతున్నాడు. మీరు వద్దనుకున్నా వాడికి బోల్డన్ని మంచి మంచి సంబంధాలు వస్తాయి. ఏమైనా ఆడపిల్ల గలవారం కదా. నా భయం నాది'' చెప్పింది సావిత్రి.


''పిచ్చితల్లీ, అలా ఎన్నటికీ జరగదమ్మా. నా మాటంటే మాటే, రాతి మీద గీతలాంటిది. అందుచేత నువ్వూ, బావగారూ ఇంక ఈ విష యంలో ఎటువంటి అనుమానాలు పెట్టుకోకుండా నిశ్చింతగా ఉండండి. నీకు మరో మారు చెబుతు న్నాను. సుధ ఈ ఇంటి కోడలు అయి తీరుతుంది'' అంటూ చెల్లికి భరోసా ఇచ్చి ఫోను పెట్టేశాడు రామారావు.

రామారావుకి పక్క సర్దుతున్న కమల అన్నా, చెల్లెళ్ల సంభాషణ విని తృప్తిగా నవ్వుకుంది.

***

''ఏవండీ రామారావుగారూ మీ అబ్బాయి ఐపిఎస్ ట్రైనింగ్ ఎప్పుడు పూర్తవు తుంది?'' అడిగాడు కొలీగ్ రాఘవాచారి.

''ఏముందండి ఇంకో నెలరోజుల్లో పూర్తయి, త్వరలోనే పోస్టింగ్ ఆర్డర్స్ తీసుకుం టాడు'' కొంచెం గర్వంగా చెప్పాడు రామారావు.



''చాలా సంతోషం. అయితే నా ఎరికలో ఓ మాంచి సంబంధం ఉంది. పిల్ల బంగారు బొమ్మలా ఉంటుంది. డిగ్రీ కూడా పాసయ్యింది. ఒక్కగానొక్క కూతురు. లక్షల ఆస్తికి వారసురాలు. మీరు ఊ... అనండి, మీకు అన్ని ముద్దు ముచ్చట్లు జరిగేలా చూస్తాను'' అంటూ రవి గురించి ఓ మంచి సంబం ధాన్ని చెప్పాడు రాఘవాచారి.

''అబ్బే, ఎందుకండీ మీకా శ్రమ. మా రవికి ఎప్పుడో సంబంధం నిశ్చయమైపోయింది'' చెప్పాడు రామారావు.

''ఏమిటీ? అప్పుడే నిశ్చయం కూడా అయి పోయిందా! ఇంతకీ ఎవరా అదృష్టవంతు రాలు?'' అడిగాడు రాఘవాచారి.

''ఇంకెవరండీ, మా చెల్లెలు కూతురు. అదే నా మేనకోడలు సుధ. మీరు ఎరుగు దురు గదా'' చెప్పాడు రామారావు.

''ఏమిటి? మొన్న రొయ్యల వ్యాపా రంలో మొత్తం ఆస్తంతా పోగొట్టుకున్న మీ సబ్బవరం బావగారి అమ్మాయా?'' అడి గాడు రాఘవాచారి.

''ఔనండి! వాళ్లమ్మాయే. ఏం మీకేమైనా అభ్యంతరమా?'' నవ్వుతూ అడిగాడు రామారావు.

''భలేవారండీ, రవి మీ అబ్బాయి, సుధ మీ మేనకోడలు. మధ్యలో నాకెందుకు అభ్యంతరం? అయితే ఒకటే బాధ. నిక్షేపం లాంటి సంబంధాన్ని కాదనుకుని, ఏమీ లేనిదాన్ని మీ కోడలుగా తెచ్చుకుంటు న్నారు. ఈ రోజుల్లో ఐపిఎస్ పాసైన పెళ్లి కొడుకంటే మాటలా, లక్షల్లో పలుకుతు న్నారు'' రామారావులో లేనిపోని ఆశలు కలిగిస్తూ అన్నాడు రాఘవాచారి.

''ఏంటోనయ్యా రాఘవాచారీ, నాకంతా అయోమయంగా ఉంది. నువ్వన్నట్లు మా బావ తన డబ్బంతా ఆ రొయ్యల చెరువులో పెట్టడంతో మొత్తం ఆస్తంతా నీళ్లపాలు అయిపోయి, ఇప్పుడు ప్రస్తుతం ఉంటున్న ఆ ఇల్లు తప్పించి మరే ఆస్తి మిగలలేదు. నువ్వ న్నదీ నిజమే ఈ రోజుల్లో డబ్బుంటే చాలు మిగతావి ఎలా ఉన్నా సర్దుకుపోవ చ్చును. నేను తొందరపడి మా చెల్లి వాళ్లకి మాట ఇచ్చేసానేమో అనిపిస్తోంది'' అమాయకంగా అన్నాడు రామారావు.

రామారావు మెల్లిగా మెత్త బడుతు న్నాడని గ్రహించిన రాఘవాచారి

''ఇదిగో రామారావు గారూ మీరు ఏమీ అనుకో నంటే నాదో సలహా'' అంటూ రామారావు వంక చూశాడు.

''ఏంటయ్యా అది'' ఆత్రంగా అడిగాడు రామారావు.

''మరేంలేదండి, ప్రస్తుతం రవికి ఇప్పట్లో పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని చెప్పి, కొంత కాలం పెళ్లి మాటల్ని వాయిదా వేయించండి. ఆడపిల్ల గుండెల మీద కుంపటిలాంటిది అంటారు కనుక, అంత కాలం మీ చెల్లీ, బావగారూ ఆగుతారా సరేసరి, లేదంటే మీరే పూనుకొని ఓ మాంచి సంబంధాన్ని చూపించి మీ ఖర్చులతో మీ మేనకోడలి పెళ్లిని చేయించేయండి. ఆ పిల్ల పెళ్లి నిమిత్తం మీరు పెట్టిన ఖర్చులను అణాపైసలతో సహా ఇప్పించేస్తాను'' అంటూ ఓ ఉచిత సలహా పారేశాడు రాఘవాచారి.

అతను చూపెడుతున్న ప్రలోభాలకు మెల్లి మెల్లిగా లొంగుతున్న రామారావుకి అతని మాటల్లో ఎంతో నిజముందనిపించడంతో ''నిజమేనయ్యా, నీవన్నట్లు చేస్తే ఇటు మా వాడికి స్థితిమంతుల సంబంధం వస్తుంది. అటు మా చెల్లెలు కూడా తన కూతురి పెళ్లి నా ఖర్చుతో చేస్తానంటే చాలా ఆనందిస్తుంది. ఒక్కదెబ్బకి రెండు పిట్టలు'' ఎంతో ఆనందంగా అనబోయి, ఎందుకైనా మంచిది ''ఈ విషయం మా శ్రీమతితోనూ, నాన్నగారితోనూ మాట్లాడి ఏ విషయం నీకు రేపు చెబుతాను'' అంటూ ఆఫీసు టైము అయిపోవడంతో ఇంటికి బయలుదేరాడు. ఇంటికి వస్తున్నంత సేపూ రాఘవాచారి చెప్పిన సంబంధం గురించి ఇంట్లో వాళ్లకి ఎలా చెప్పాలా? అని మనసులో రిహార్సల్స్ వేసుకున్నాడు.

***

రాత్రి భోజనాల దగ్గర తండ్రితోపాటు, భార్య కమలను కూడా కూర్చోమన్నాడు రామారావు.

ఎప్పుడూ లేంది భర్త ముఖంలో ఏదో తెలియని టెన్షన్ చూసిన కమల, ''ఏంటండీ అలా ఉన్నారు'' డైనింగ్ టేబిల్ కుర్చీని ముందుకు తోసుకుంటూ అడిగింది.

విషయాన్ని వాళ్లకి ఎలా చెప్పాలో తెలియని రామారావు అయోమయంగా అటూ ఇటూ చూసాడు.

''ఏంటిరా, ఆఫీసులో ఏదైనా ప్రాబ్లమా?'' అడిగాడు సోమశేఖరం.

''అబ్బే అటువంటిది ఏమీ లేదు నాన్నా'' చెప్పాడు రామారావు..

''మరైతే ఎందుకలా ఆదుర్దాగా ఉన్నావు? విషయం ఏమిటో నాన్చకుండా చెప్పొచ్చుగా''

''అదీ...ఏం లేదు నాన్నా, ఇవాళ మా కొలీగ్ మన రవికి ఓ మంచి సంబంధాన్ని తీసుకొని వచ్చాడు. అమ్మాయి డిగ్రీ వరకూ చదివిందిట. వాళ్లకి ఒక్కర్తే ఆడపిల్ల. బాగా ఆస్తిపాస్తులున్నాయట'' అంటూ ఇంకా ఏదో చెప్పబోయిన రామారావు మాటలకు అడ్డు వస్తూ ''అదేంటిరా, మన రవికి, నీ మేనకోడలు సుధని చేసుకుంటానని సావిత్రికి మాటిచ్చావు కదా! మరల ఈ బయటి సంబంధాల గోల ఏమిటి? అదే విషయం అతనితో చెప్పకుండా సిగ్గులేకుండా మా వాళ్లతో మాట్లాడి చెబుతానంటావా?'' కొంచెం కోపంగానే అన్నాడు సోమశేఖరం.

''నిజమే నాన్నా సావిత్రికి మాటిచ్చాను. కాదని ఎవరన్నారు. అయితే నేను చెప్పేది పూర్తిగా విని అప్పుడు మీరిద్దరూ మీ అభిప్రాయాలు చెప్పండి'' రామారావు కూడా కొంచెం సీరియస్‌గా అన్నాడు.

''నువ్వేమైనా చెప్పు, మన రవికి వేరే సంబంధం చూస్తాను అంటే నేను ఒప్పుకోను. ఆపై మీ ఇష్టం'' అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు సోమశేఖరం.

అలా వెళ్లిపోయిన మామగారి వంకే చూస్తున్న కమలతో, ''కమలా! నీ అభిప్రాయం కూడా అదేనా'' వ్యంగ్యంగా అన్నాడు రామారావు.

''అది కాదండి, మీరు మన సావిత్రికి ఏనాడో మాటిచ్చారు మరల నిన్న కూడా భరోసా ఇచ్చారు. మీ మాటలు నమ్మి వాళ్లు మిగతా సంబంధాలను కూడా వదులుకుంటున్నారు. అటువంటిది ఈనాడు మీరిలా సడనుగా మన రవికి వేరే సంబంధం చూస్తున్నారని తెలిస్తే సావిత్రి ఏమనుకుంటుంది? చుట్టు పక్కల వాళ్లు ఏమనుకుంటారో, ఏనాడైనా ఆలోచించారా?'' వీలైనంత శాంతంగా అంది కమల.

''అంటే నా కొడుకు పెళ్లి విషయంలో నాకు ఏ నిర్ణయమూ తీసుకునే హక్కు లేదంటావా?'' ఉక్రోషంగా అన్నాడు.

''లేదని ఎవరన్నారండీ! అయినా ఒకసారి మీరు నిర్ణయం తీసుకున్న తరువాత ఎవరో ఏదో ఆశ చూపించారని, మీ నిర్ణయాన్ని మార్చుకోవడం సబబు కాదండీ'' నచ్చచెప్పబోయింది కమల.

''నా చెల్లెలు కూతుర్ని ఏం చూసుకొని చేసుకోమంటావు? ఓ ఆస్తా పాస్తా, చదువు కూడా ఏం ఉపయోగం లేని చదువు చదివింది. అదే ఏ డాక్టరో, ఇంజనీరో చదివి ఉంటే, పోనీలే, ఆస్తి లేకపోయినా చదువుందని సరిపెట్టుకునేవాడిని. అందుచేత నా మాట విని ఈ విషయాన్ని సావిత్రికి నువ్వే ఎలాగోలా నచ్చచెప్పు'' అంటూ మరో మాటకి తావివ్వకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

భర్త నిర్ణయంలో వచ్చిన ఆకస్మిక మార్పుకి తట్టుకోలేని కమల, 'ఓ భగవంతుడా, ఏమిటీ పరీక్ష, ఎలాగైనా రవికి, సుధకి పెళ్లి అయ్యేలా చూడు తండ్రీ' అని నిండు మనస్సుతో ప్రార్థించింది.

***


ఆ రోజు ఆఫీసు నుంచి ఇంటికి వచ్చిన రామారావు, ఇంట్లో చెల్లెలు సావిత్రిని, బావగార్ని చూసి ఖంగుతిన్నాడు. అయినా తమాయించుకుని ''ఏంటి బావగారూ, వచ్చి ఎంత సేపయ్యింది. కులాసాయేనా?'' లేని నవ్వుని తెచ్చుకొని వారిని పలకరిస్తూ అన్నాడు.

''ఏంటి అన్నయ్యా, ఏమీ తెలియనట్లు అడుగుతున్నావు? నువ్వు మన రవికి ఏదో వేరే సంబంధం చూస్తున్నావుటగా? నా కూతుర్ని చేసుకుంటానని మాటిచ్చి నువ్విలా వేరే సంబంధాన్ని చూడ్డం నీకు భావ్యమేనా?'' ఏడుస్తూ అడిగింది సావిత్రి.

''నిజమేఁ భావ్యం కాదు. కానీ నాకూ కొన్ని ఆశలు ఉంటాయి గదా. మావాడా ఐపిఎస్ చేసి ఇవాళో రేపో మంచి హోదా గల ఉద్యోగాన్ని చేబడతాడు. మీరి మీకేమైనా పెద్దగా ఆస్తిపాస్తులు ఉన్నాయా అంటే అదీ లేదు. పోనీ మన సుధ ఏమైనా డాక్టరు చదువుగానీ, ఇంజనీరింగ్ గానీ చేసిందా అంటే అదీ లేదు. మరి ఏం చూసి మీ కూతుర్ని చేసుకోమంటావు. పైగా రవికి లక్షల్లో కట్నాలు ఇస్తామంటూ సంబంధాలు వస్తుంటే ఆశ పడడం తప్పంటావా?'' తెలివిగా సావిత్రిని తిరిగి ప్రశ్నించాడు రామారావు.

''చాలా బావుందన్నయ్యా! ఎవరో లక్షలు ఇస్తున్నారు గదాని, అయిన సంబంధాన్ని కాదనుకుని, ఆడిన మాట తప్పుతున్నావు ఇదేనా నీ సభ్యతా, సంస్కారం?'' బాధగా అంది సావిత్రి.

''చూడు సావిత్రీ, సభ్యతా, సంస్కారాల గురించి నీతో కొత్తగా చెప్పించుకునే స్థితిలో లేను. కావాలంటే



మన సుధకి ఏదైనా మంచి సంబంధం చూడు. దాని పెళ్లి నా సొంత ఖర్చులతో ఘనంగా జరిపిస్తాను'' ఎంతో క్యాజువల్‌గా అన్నాడు రామారావు.

''చాలన్నయ్యా, నీ మనసేమిటో అర్థమైంది. నువ్వు చెప్పినట్లు చేస్తే దాని బ్రతుకు మనసొక చోట, మనువొక చోట అన్నట్లుగా అవుతుంది. ఇప్పటికే మా సుధ రవి మీద ఎన్నో ఆశలు పెంచుకొని, రవే తన భర్త అని ఎన్నో కలలు కంటోంది. ఇప్పుడు రవిని కాదని వేరే వాడిని చేసుకోమంటే దాని మనసు ఎంతగా బాధపడుతుందో ఏనాడైనా ఊహించావా?'' నిలదీసింది సావిత్రి.

''వెధవ మనసుదేముంది? ఓ రెండు మూడునెలలు కట్టుకున్న వాడితో కాపురం చేస్తే అదే సర్దుకుపోతుంది.'' ఎంతో తేలిగ్గా చెప్పాడు రామారావు.

''సరే అన్నయ్యా, ఆఖరి సారిగా అడుగుతున్నాను. కాదు సుధని మీ ఇంటి కోడలు చేసుకోమని అర్థిస్తున్నాను'' చీర కొంగుతో కళ్ల నీళ్లు తుడుచుకుంటూ అంది సావిత్రి.

ఆమె ఆవేదన అర్థం చేసుకున్న సోమశేఖరం, ఆగలేక ''ఏంటిరా? ఇంటి ఆడపడుచు అంతగా అభ్యర్థిస్తుంటే, మనసులేని మృగంలా మాట్లాడుతున్నావు. నువ్వు మాట ఇవ్వబట్టే గదా, అది మన సంబంధం మీద అన్ని ఆశలు పెట్టుకుంది. తీరా ఇప్పుడు నువ్వు కాదంటే, పెళ్లి కావల్సిన ఓ ఆడపిల్ల గతేం కాను? ఇదేనా నేను నీకు నేర్పిన సభ్యతా, సంస్కారమూను'' కొంచెం ఆవేశంగా అన్నాడు.

తండ్రి మాటలకు ఏమాత్రం సంబంధం చెప్పని అన్నయ్యాని చూసిన సావిత్రి ''పోనీలే నాన్నా, ఈ ఇంటికి కోడలయ్యే అదృష్టం నా కూతురికి లేదనుకుని సరిపెట్టుకుంటాను. అన్నయ్యా, ఈరోజున నీ కొడుకు ఏదో పెద్ద హోదా వెలగబెట్టబోతున్నాడని, నాకు ఇచ్చిన మాటను తప్పుతున్నావు. నీకు చెల్లెలి కుటుంబం మీదున్న గౌరవం, అభిమానం ఇంతేనా? అన్నయ్యా! ఒక్క విషయం గుర్తుంచుకో, నేనూ నీలాగే సభ్యతా, సంస్కారమనే 'నారు' లోంచి పెరిగిన మొక్కనే. నువ్వు వాటిని తాత్కాలికంగా డబ్బు వ్యామోహంలో పడి మరిచిపోయినా, నేను ఎన్నడూ మరువను. అందుచేత నేను గానీ, మా వారు గానీ ఇంక సుధ పెళ్లి విషయంలో, మిమ్మల్ని ఇబ్బంది పెట్టము. ఏ విధమైన రభస చెయ్యకుండా మాకింతే ప్రాప్తం అని సరిపెట్టుకుంటాము'' అంటూ అక్కడే ఉన్న భర్తను తీసుకొని బయటకు వెళ్లిపోయింది సావిత్రి.

***

''రారా...రవీ...రా, ఏంటీ ట్రైనింగు బాగా అయిందా?'' ఆప్యాయంగా కొడుకుని అడిగింది కమల.

''ఆహా...చక్కగా పూర్తయిందమ్మా. బహుశా వచ్చే నెలలో పోస్టింగు ఆర్డర్స్ రావొచ్చును. అమ్మా, ఆర్డర్స్ వచ్చేలోపున ఓసారి అత్తయ్యను, మావయ్యను చూడాలని ఉందమ్మా'' తల్లి దగ్గరగా కూర్చుంటూ అన్నాడు రవి.

''ఇప్పుడేం అక్కర్లేదు'' అంటూ అక్కడే ఉన్న రామారావు కోపంగా అనేసరికి ఆశ్చర్యపడ్డ రవి, తల్లి వంక ఏమిటి ఈయన వింత ధోరణి అన్నట్లుగా కళ్లతోనే ప్రశ్నించాడు.

నేను తరువాత చెబుతాను అన్నట్లుగా ఆమె తిరిగి సైగ చేయడంతో, ఏదో పెద్ద విశేషమే ఉందనుకున్న రవి మారుమాట్లాడకుండా అక్కడ నుంచి తాతయ్యను పలకరించడానికి సోమశేఖరం రూములోకి వెళ్లాడు.

***

తల్లి, తాతయ్యలు అంత వరకూ జరిగిన బాగోతాన్ని గురించి చెప్పడంతో ''ఓహో, సుధతో నా పెళ్లి విషయంలో నాన్న ఇంత రాద్ధాంతం చేసాడన్న మాట'' బాధగా అన్నాడు రవి.

''అంతే కాదు బాబూ, ఇవాళో రేపో ఈ విషయాన్ని నీతో చెప్పి ఎలాగైనా నీ మనసుని మార్చడానికి ప్రయత్నిస్తారు. ఆయన నీ పెళ్లి విషయంలో ఏం చెయ్యడానికైనా సిద్ధమే అన్నట్లుగా ఉన్నారు'' భయంగా అంది కమల.

''అమ్మా, నువ్వేం కంగారు పడకు. నేను మీ పెంపకంలో పెరిగిన వాడిని. ఇంకా నాలో సభ్యతా, సంస్కారాలు, మంచి మర్యాద, మానవతలు చచ్చిపోలేదమ్మా. ఎలాగైనా నాన్న అత్తయ్యకు ఇచ్చిన మాట ప్రకారం మీరు కోరుకుంటున్నట్లే సుధతో నా పెళ్లి జరిగేలా చేస్తాను. అందుకు మీ సహకారం ఉంటే చాలు'' అంటూ వారిరువురికి తన ప్లాన్ గురించి చెప్పాడు.

''సరేరా, నువ్వు చెప్పినట్లే చేస్తాం. నీ పెళ్లి సుధతో జరిగితే మాకంతే చాలు'' అంటూ ఆనందంగా అన్నారు కమల, సోమశేఖరంలు.

***

''ఏంటిరా ఇంత సడనుగా ఎక్కడికి ప్రయాణం?'' బట్టలు సర్దుతున్న కొడుకు రవిని అడిగాడు రామారావు.

''ఏం లేదు నాన్నా, మా కాలేజీలో చదివిన పాత విద్యార్థులం అందరం సరదాగా ఓ చోట కలవాలని అనుకున్నాం. ఎల్లుండే ఆ 'మీట్' హైదరాబాదులో జరుగుతోంది. ఓ మూడు నాలుగు రోజుల్లో వచ్చే

నమ్మించి మోసం చేసిందామె. దాంతో ఆమెను చంపేశాడతను. చంపేసిన తర్వాత తెలిసింది. ఆమె తనని మోసం చెయ్యలేదని. నిజం తెలుసుకున్న అతను ఆమె చితి దగ్గర కన్నీరు మున్నీరుగా విలపించాడు. బూడిదగా మారిపోయిన ఆమెను దోసిళ్ళతో తీసుకుని గుండెలకు అదుముకున్నాడు. కాటి కాపరి కసిరితే ఆ రాత్రి...ఆ చీకటిలో వెను తిరిగి జన సంద్రంలో కలిసిపోయాడు. అలా కలసిపోయిన అతను ఎక్కడ తేలాడు? ఏ తీరాన నిలిచాడు?

ప్రముఖ రచయిత్రి 'అరణి' సంచలన సృష్టి

## సముద్రం మీద సంతకం

సీరియల్ త్వరలో ప్రారంభం

స్తాను'' అంటూ నవ్వుతూ చెప్పాడు రవి.

''సరేరా చాలా బావుంది. నిన్న నేను చెప్పిన సంబంధం గురించి నీ అభిప్రాయం చెప్పనే లేదు. వాళ్లు రోజూ కబుర్ల మీద కబుర్లు పంపుతున్నారు వాళ్లకేం చెప్పమంటావు?'' అడిగాడు రామారావు.

''ఇందులో చెప్పడానికేముంది నాన్నా. అయినా మీరు ఓ నిర్ణయానికి వచ్చిన తరువాత దాన్ని కాదనే కుసంస్కారం నాలో లేదు. ఎందుకంటే నేను మీ పెంపకంలో పెరిగిన 'నారుని'. విత్తొకటి వేస్తే, చెట్టొకటి రాదు కదా! మీరు ఏం చేసినా నా బాగుకోసమే చేస్తారు. అందుచేత మీ ఇష్టం. మీకు ఎలా తోస్తే అలా చెయ్యండి. నాకేమీ అభ్యంతరం లేదు'' అంటూ అక్కడే ఉన్న తల్లికేసి ఓరగా నవ్వుతూ చూసాడు.

''నాకు తెలుసురా. నువ్వు నేను చెప్పినట్లు వింటావని. అనవసరంగా మీ అమ్మా, తాతయ్యలు నన్ను అర్థం చేసుకోకుండా నేనేదో నేరమో, ఘోరమో చేస్తున్నట్లు తప్పు పడుతున్నారు. సరే నువ్వెళ్లు, కానీ వీలైనంత త్వరగా వచ్చెయ్యి. ఎందుకంటే నువ్వొచ్చిన తరువాత పెళ్లిచూపులు ఏర్పాటు చేయమని చెబుతాను'' అంటూ కమల వైపు వాడెంతైనా నా కొడుకు అన్నట్లు చూసాడు రామారావు.

***

ఆనాడు ఆదివారం. ఇంట్లోనే ఉండి ఆనాటి పేపరు చదువుతున్న రామారావు, కాలింగ్ బెల్ మోగడంతో ఈ టైములో ఎవరు వచ్చుంటారబ్బా అనుకుంటూ లేచి తలుపు తీసి మెడలో దండలతో వచ్చిన కొడుకుని, పక్కనే నెత్తి మీద ముసుగు కప్పుకున్న అమ్మాయిని చూసి ఆశ్చర్యపోయాడు.

''నాన్నా ఈ అమ్మాయి మేరీ, ట్రైనింగులో నా బ్యాచ్ మేటు. ఈ అమ్మాయి, నేనూ ఒకరంటే ఒకరం ఇష్టపడి ప్రేమించుకున్నాం. మీలాగే, మేరీ అమ్మానాన్నలు గూడా మా పెళ్లికి ఒప్పుకోరని తెలిసి ఇలా గుళ్లో పెళ్లి చేసుకున్నాం. మమ్మల్ని ఆశీర్వదించండి'' అంటూ అతని కాళ్లకు దణ్ణం పెట్టబోయాడు రవి.

''ఛీ..భ్రష్టుడా, నా కడుపున చెడబుట్టావు కదరా! ఎవరో కులం, గోత్రం లేని దాన్ని తీసుకొచ్చి నాన్నా మీ కోడలు అంటే ఎలా ఒప్పుకుంటాననుకున్నావు. అయినా నీకోసం నిక్షేపం లాంటి సంబంధాన్ని చూస్తుంటే ఇలా ఎవరినో చేసుకోవడానికి నీకు సిగ్గు లేదూ'' అంటూ రవి మీద కోపంతో ఊగిపోతున్న రామారావు చేతిలో హారతి పళ్లెంతో వచ్చిన కమలను చూసి ఇంకా రెచ్చిపోయాడు. ''అంటే వీడి భాగోతం అంతా నీకు ముందే తెలుసన్న మాట. అందుకే తగుదునమ్మా అంటూ సిగ్గు లేకుండా హారతి పళ్లెం తీసుకొని మరీ వచ్చావు'' అంటూ కోపంగా అనడంతో భయపడిన కమల హారతి పళ్లెన్ని పక్కగా పెట్టి భయంగా అతని వంక చూసింది.

''చూడండి నాన్నా, ఈ విషయంలో మీరు అమ్మని ఏమీ అనొద్దు. ఈ పెళ్లి పూర్తిగా నా ఇష్టం మీదే జరిగింది. మీరు మమ్మల్ని ఆశీర్వదించారా సరేసరి, లేకుంటే నేను ఇక్కడి నుంచి సరాసరి బయటకు వెళ్లిపోతాను'' అంటూ తండ్రిని బెదిరించాడు రవి.

''పోరా, నీ ఇష్టం వచ్చిన చోటికి ఫో...ఇంక నీకు ఈ ఇంట్లో స్థానం లేదు. కమలా! నువ్వు కూడా వాడితో మాట్లాడకు'' అని అక్కడి నుంచి కోపంగా వెళ్లబోతున్న రామారావు, రవి తల్లి కమలతో ఏదో అనడం చూసి, ''ఏంటి కమలా, నీకు కూడా నా మాటంటే లక్ష్యం లేదా? వాడు నామాట కాదని, ఎవరో ముక్కూమొహం తెలియని దాన్ని పెళ్లి చేసుకొని వస్తే, అది మీకు ఆనందంగా ఉందన్నమాట'' ఆవేశంగా అన్నాడు.

''ఏవండీ, వాడు మీ కొడుకండీ మీరనుకున్నట్లుగా కాని పని ఏదీ చెయ్యడు'' అంటూ నవ్వుతూ అంతవరకూ ముసుగులో ఉన్న మేనకోడలు సుధ ముఖం నుంచి ముసుగుని తప్పించింది కమల.

కొడుకు పక్కన అలా పెళ్లి కూతురు బట్టల్లో ఉన్న మేనకోడలు సుధని చూసి ఆశ్చర్యపోయిన రామారావు ''ఆరి భడవా ఎంత హడలు గొట్టేసావు. అయినా తండ్రిని నాతో ఒక్కమాట కూడా చెప్పకుండా ఇలా దొంగచాటుగా పెళ్లి చేసుకోవల్సిన ఆగత్యం నీకేం పట్టింది'' బాధగా అన్నాడు రామారావు.

అంతవరకూ అక్కడే మౌనంగా ఉన్న సోమశేఖరం ''ఏం చెయ్యమంటావు? నువ్వేమో వాడికేదో వేరే సంబంధం గురించి చెప్పావు. వాడేమో సుధ మీద ఏనాడో మనసు పారేసుకున్నాడు. నువ్వు డబ్బు మోజులో పడి, అయిన వాళ్లని, ఇచ్చిన మాటలను కాదనుకున్నావు. వాడు నీ కొడుకురా, నువ్వూ, నీ చెల్లి ఎలా అయితే సభ్యతా, సంస్కారమనే 'నారుమడి'లో మొక్కలుగా పెరిగారో, వాడు కూడా అదే నారుమడిలో పెరిగిన మొక్క సంతతే కదరా! ఐతే, ఎంత ఒకే 'ఆకుమడి'లోని మొక్కలైనా, ఒక్కొక్కసారి కొన్ని మొక్కలకు తెగులు సోకినట్లే, నీకు కూడా డబ్బనే తెగులు సోకింది. మొక్కకు పట్టిన తెగులు పోవడానికి మందు ఎలా జల్లుతామో, నీకు పట్టిన ఆ డబ్బు తెగులు పోగొట్టడానికి మన రవి చల్లిన మందురా ఇది. ఇప్పటికైనా నీకు పట్టిన డబ్బు తెగులు పోయిందా లేదా?'' అంటూ ఆయన నవ్వుతూ అనడంతో అంతవరకూ వారంతా కలిసి ఆడిన నాటకం పూర్తిగా అర్థమైన రామారావు, ''సారీ నాన్నా, నన్ను క్షమించండి. మీరన్నట్లు నాకు నిజంగా డబ్బు తెగులే పట్టింది. దానికి మీరంతా కలిసి చాలా చక్కటి మందు వేసారు. నేను ఇంతవరకూ డబ్బు మోజులో పడి, కళ్లు మూసుకుపోయి ఇంటి ఆడబడుచుకి ఇచ్చిన మాటలను కాదని, మిమ్మల్ని బాధ పెట్టాను'' అంటూ సిగ్గుగా చెప్పాడు.

''అన్నయ్యా, నువ్వంతలా బాధపడాల్సిన అవసరం లేదురా. నాన్న అన్నట్లు మనం అంతా ఓ నారుమడిలోని మొక్కలమే. ఎన్నటికీ సభ్యతా, సంస్కారాలను వదులుకోలేము'' అంటూ నవ్వు లోపలకు వచ్చింది సావిత్రి.

''బావుందమ్మా, మొత్తానికి మీరందరూ కలిసి నాకు పట్టిన డబ్బు తెగులును నయం చెయ్యడంతో పాటు మర్చిపోతున్న మన అనుబంధాలను గురించి కూడా నాకు చక్కగా గుర్తు చేసారు'' అంటూ కొడుకునీ, కోడలిని మనస్ఫూర్తిగా ఆశీర్వదించాడు రామారావు.

☆


చిరునామా

ఎస్. నాగేంద్రప్రసాద్

పర్సనల్ అసిస్టెంట్

బనారస్ హిందూ యూనివర్సిటి

డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైక్రోబయాలజీ ఇనిస్టిట్యూట్

ఆఫ్ మెడికల్ సైన్సెస్

వారణాసి-221005

ఫోన్: 09415368475